

టన్ను చీనీ రూ.17 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17 వేలు పలికాయి. మార్కెట్‌కు 331 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.23

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.23, కనిష్టంగా రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

37.9°/ 23.2°

జిల్లా పరిధిలో మంగళవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఆకాశం మేఘావృతమై చాలా మండలాల్లో వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

80 శాతం రాయితీతో 'ప్రత్యామ్నాయం'

- జిల్లాకు 18,265 క్వింటాళ్లకు అనుమతి



ఉలవ విత్తనాలు

పుట్టపర్తి అర్బన్: ఎట్టకేలకు రైతులకు ప్రత్యామ్నాయ విత్తన పంపిణీపై ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 2,89,601 హెక్టార్లు కాగా, వర్షాభావంతో జిల్లా వ్యాప్తంగా కేవలం 99,969 హెక్టార్లలోనే వివిధ రకాల పంటలు సాగులోకి వచ్చాయి. ఇందులో ప్రధాన పంట వేరుశనగ 65 వేల హెక్టార్లకే పరిమితమైంది. అదునుదాటి పోవడంతో జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే 24619 క్వింటాళ్ల ప్రత్యామ్నాయ విత్తన ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ నేపథ్యంలోనే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలంటూ వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా వర్షాభావంతో ఖరీఫ్‌లో ప్రధాన పంటల సాగు తగ్గిపోయిన నేపథ్యంలో 80 శాతం రాయితీతో ఏపీ సీడ్స్ ద్వారా విత్తనాలు అందించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 18,265 క్వింటాళ్లు, అనంతపురం జిల్లాకు 27,907 క్వింటాళ్లు పంపిణీకి అనుమతులు ఇచ్చారు. జిల్లాలో 15,221 క్వింటాళ్ల ఉలవలు, 2,099 క్వింటాళ్ల పెసలు, 720 క్వింటాళ్ల అలసంద, 225 క్వింటాళ్ల జొన్నల పంపిణీకి అనుమతులిచ్చారు. ఈ విషయంపై రైతుల్లో అవగాహన కల్పించాలని జిల్లా అధికారులకు సూచించారు. విత్తనాలు తీసుకున్న రైతులు తప్పనిసరిగా పంట సాగు చేసినట్లు ఈ-క్రాప్ నమోదు చేపట్టాలన్నారు. రైతు సేవా కేంద్రాల వేదికగా డీ-కృషి యాప్ ద్వారా ఒక్కో రైతుకు గరిష్ఠంగా రెండు హెక్టార్లకు విత్తన పంపిణీ చేయాలని పేర్కొన్నారు. రెండు మూడు రోజుల్లో విత్తనాలకు సంబంధించి ధరలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి.

విద్యా సంస్థల బస్సుల తనిఖీ

- 13 కేసుల నమోదు



హిందూపురం సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

హిందూపురం అర్బన్: రవాణాశాఖ అధికారులు మంగళవారం జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థల బస్సులను తనిఖీ చేశారు. హిందూపురం, కదిరి, పుట్టపర్తి, పెనుకొండ, మడకశిర తదితర ప్రాంతాల్లోని వివిధ విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేసి నిబంధనలు అతిక్రమించిన బస్సులపై 13 కేసులు నమోదు చేశారు. అందులో మూడు బస్సులకు ట్యాక్స్‌లు చెల్లించకపోవడం, పలు బస్సులకు పర్మిట్లు లేకపోవడం, రెండు బస్సుల డ్రైవర్లకు లైసన్స్‌లు లేక పోవడంతో రవాణాశాఖ జిల్లా అధికారి కరుణసాగర్‌రెడ్డి రూ.1,13,900 జరిమానా విధించారు. మరోమారు నిబంధనలు అతిక్రమించి పట్టుబడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని వాహనదారులను హెచ్చరించారు. తనిఖీల్లో ఎంవీఐలు జయశ్రీ, శివశంకర్, ఉదయ్ కుమార్, వరప్రసాద్, రాణి, రాజేష్ పాల్గొన్నారు.

జిల్లాకు 'ఎల్లో' అలర్ట్

భారత వాతావరణ శాఖ, అమరావతి వాతావరణ కేంద్రం జిల్లాకు 'ఎల్లో అలర్ట్' ప్రకటించినట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి మంగళవారం తెలిపారు. అల్పపీడన ద్రోణి కారణంగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయన్నారు. మంగళవారం జిల్లా పరిధిలో మోస్తరుగా వర్షాలు కురిశాయన్నారు. బుధ, గురువారంతో పాటు ఈనెల 16 తేదీ కూడా జిల్లాకు వర్షసూచన ఉందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో కొన్ని మండలాల్లో భారీ వర్షపాతం నమోదు కావచ్చన్నారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచన ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 34.2 డిగ్రీల నుంచి 35.6 డిగ్రీలు, కనిష్ఠం 26.3 డిగ్రీల నుంచి 27.2 డిగ్రీల మధ్య నమోదు కావచ్చని తెలిపారు. గాలిలో తేమశాతం ఉదయం 78 నుంచి 86, మధ్యాహ్నం 65 నుంచి 78 శాతం మధ్య రికార్డుకావచ్చన్నారు.

దంచేసిన వాన



హిందూపురం: జలమయమైన అహమ్మద్‌నగర్‌లోని ఓ వీధిలో ప్రజల అగచాట్లు

- జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం
- హిందూపురం అతలాకుతలం
- విరిగిపడిన చెట్లు..పంటలకు తీవ్ర నష్టం

పుట్టపర్తి అర్బన్: ఉపరితల ద్రోణి ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ జిల్లాలోని 26 మండలాల పరిధిలో వర్షాలు కురవడంతో 39.9 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. వరుణుడు ప్రభావం చూపడంతో చాలా ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈదురుగాలులు తోడు కావడంతో ఉద్యానపంటలకు నష్టం వాటిల్లింది. అత్యధికంగా నల్లచెరువు మండలంలో 200.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక తనకల్లులో 94.6 మి.మీ, అమడగూరు 86.4, కదిరి 84.2, హిందూపురం 74.6, ధర్మవరం 62.4, పెనుకొండ 57, కొత్తచెరువు 56.4, ఓడీచెరువు 55.4, సోమందేపల్లి 50.4, బుక్కపట్నం 49.6, రామగిరి 46.4, పరిగి, గోరంట్ల మండలాల్లో 45.2 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. అలాగే సీకేపల్లి 42.2, పుట్టపర్తి 39.8, లేపాక్షి 37.2, నల్లమాడ 35.4, చిలమత్తూరు 32.6, రొద్దం 25.4, గాండ్లపెంట 15.2, ఎన్‌పీ కుంట 14, అగళి 10.6, మడకశిర 9.8, కనగానపల్లి 4.6, తలుపుల మండలంలో 3.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

దెబ్బతిన్న టమాట, మొక్కజొన్న, వరి పంటలు

నల్లచెరువు మండలంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు నాలుగు గంటల పాటు వరుణుడు ప్రతాపం చూపడంతో 200.2 మి.మీ వర్షపాతం నమోదైంది. పలుచోట్ల చెట్లు విరిగి నేల కొరిగాయి. ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో నీరు చేరింది. ఉప్పార్లపల్లి గ్రామం సమీపంలోని వంక పొంగి ప్రవహించడంతో ఆ గ్రామానికి దాదాపు 4 గంటల పాటు రాకపోకలకు నిలిచిపోయాయి. పలు గ్రామాల్లో మొక్కజొన్న, పత్తి, టమాట పంటలకు నష్టం జరిగింది. దాదాపు 20 ఎకరాల్లోని వరి పంట నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది.

'పురం'... జలమయం

మంగళవారం తెల్లవారుజామున ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి హిందూపురం జలమయమైంది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పట్టుగూళ్ల మార్కెట్ ఆవరణలోకి వర్షపునీరు చేరడంతో రైతులు తీసుకువచ్చిన పట్టుగూళ్లు తడిచిపోయాయి రైతులకు తీవ్ర నష్టం జరిగింది.

- కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. కదిరి మండల పరిధిలోని మల్లయ్యగారి పల్లితండాలో నాగేనాయక్‌కు చెందిన 17 గొర్రెలు నీటమునిగి చనిపోయాయి.



కదిరి: మల్లయ్యగారిపల్లితండాలో వర్షపు నీటిలో మునిగి చనిపోయిన గొర్రెలు



నల్లచెరువు: ఉప్పార్లపల్లి వద్ద పొంగి పొర్లుతున్న వంక



హిందూపురం: పట్టుగూళ్ల మార్కెట్ లోపల నిలిచిన వర్షపునీరు

తడిసిపోయిన పట్టుచీరలు



ధర్మవరం: జగజ్జీవన్‌రామ్‌నగర్‌లోని ఓ ఇంట్లోకి చేరిన వర్షపునీరు



తడిసిన పట్టుచీరలు

ధర్మవరం అర్బన్: భారీ వర్షానికి ధర్మవరం అతలాకుతలమైంది. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, వర్షపు నీరంతా ఇళ్లలోకి చేరింది. ఎల్‌పీ సర్కిల్‌లోని వ్యాపారి సుధాకర్ నిర్వహిస్తున్న చీరల దుకాణంలోకి వర్షపు నీరు చేరడంతో పట్టు చీరలన్నీ తడిసిపోయాయి. ఇంటి పైకప్పుకున్న పీఓపీ కూడా కిందపడింది. ఇక జగజ్జీవన్ రాంనగర్‌లోని ఇళ్లలోకి వర్షపునీరు చేరడంతో ఇళ్లలోని వస్తువులు, సరుకులు తడిసిపోయాయి.

దేశభక్తి పెంపొందేలా 'హర్ ఘర్ తిరంగా'

- స్ఫూర్తి పొందేలా స్వాతంత్య్ర వేడుకలు



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రతి భారతీయునిలో దేశభక్తి పెంపొందేలా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి గణేష్ సర్కిల్ వరకూ నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు జాతీయ జెండాల ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ సమైక్యతను, సమగ్రతను కాపాడటం అందరి బాధ్యత అన్నారు. దేశ సమగ్రతను కాపాడే 'హర్ ఘర్ తిరంగా' మహోన్నత కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. స్వాతంత్య్ర సమర యోధులను, వారి నిస్వార్థ సేవలను గుర్తు చేసుకుని వారిని సత్కరించుకోవాలన్నారు. జిల్లా, మండల కేంద్రాలు, గ్రామాల్లో జాతీయతా భావం ఉట్టి పడే విధంగా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఉదయ్‌భాస్కర్, ఎంఈఓ ఖలీల్, ఉపాధ్యాయులు, పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కిన యువకుడు

- భూ సమస్య తీరలేదని మనస్తాపం



నచ్చజెబుతున్న పోలీసులు (ఇన్‌సెట్) సెల్‌టవర్‌పై మహేంద్ర

చెన్నేకొత్తపల్లి: తాతలనాటి ఆస్తి విషయంలో అధికారులు తనకు న్యాయం చేయడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. మూడు గంటల పాటు అందరినీ ముప్పుతిప్పలు పెట్టాడు. వివరాల్లోకి వెళితే...పులేటిపల్లి పంచాయతీలోని కోటంపల్లి గ్రామానికి చెందిన మహేంద్రకు తన తాతల నాటి భూమి 3.80 ఎకరాలు రావాల్సి ఉంది. అయితే ఈ భూమిని తన చిన్నాన్నలు తీసుకున్నారు. దీంతో మహేంద్ర న్యాయం కోసం అధికారులను ఆశ్రయించినా సమస్యకు పరిష్కారం లభించలేదు. తీవ్ర మనస్తాపం చెందిన మహేంద్ర మంగళవారం సీకేపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలోని బీఎస్ఎన్‌ఎల్ టవర్‌ను ఎక్కాడు. గమనించిన పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. మహేంద్ర తల్లి, భార్య, కుటుంబ సభ్యులు టవర్ వద్దకు చేరుకుని కిందకు దిగిరావాలని బతిమాలారు. తనకు ఇప్పటికిప్పుడు న్యాయం జరగాలని, లేకపోతే దూకేస్తానంటూ హెచ్చరించాడు. చివరకు పోలీసులు మహేంద్ర చిన్నాన్నను పిలిపించి అతనితోనే మాట్లాడించారు. దీంతో రాత్రి 7.45 గంటలకు మహేంద్ర సెల్‌టవర్ నుంచి కిందకు దిగాడు.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసు

పుట్టపర్తి టౌన్: గిరి ప్రదక్షిణ చేసేందుకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఈనెల 18వ తేదీ పుట్టపర్తి బస్టాండ్ నుంచి అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ఇనయతుల్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు బయలుదేరే ఈ బస్సులో అరుణాచలం వెళ్లే వారికి వేలూరులోని గోల్డెన్ టెంపుల్, కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనం కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రయాణికులు ఆన్‌లైన్ ద్వారా లేదా పుట్టపర్తి బస్టాండ్‌లోని టికెట్ కౌంటర్‌లో అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 7382860486, 9959225857 నంబర్లలో సంప్రదించాలన్నారు. అలాగే ఈనెల 17న 'హనుమాన్ దర్శన్' సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం వెల్లడించారు. అనంతపురం జిల్లాలోని ప్రముఖ హనుమాన్ ఆలయాలైన మురిడి, నేమకల్లు, కసాపురం దేవస్థానాలను ఒకేరోజులో సందర్శించవచ్చన్నారు.

చేయూత ఏదీ..?

- హిందూపురానికి చెందిన వరలక్ష్మి వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏటా రూ.18,750 చొప్పున గత ప్రభుత్వ హయాంలో లబ్ధి పొందింది. ఇలా మూడు విడతల్లో రూ.56,250 అందుకుంది. ఈమెకు ఇంకా చివరి విడతలో మరో రూ.18,750 రావాల్సి ఉంది. అయితే ఈలోపు ఎన్నికలు రావడంతో కూటమి నేతలు అడ్డు తగిలారు. దీంతో ఎన్నికల కమిషన్ కలుగజేసుకొని అప్పట్లో చేయూత నగదు పంపిణీని నిలిపివేయాలని ఆదేశించింది. దీంతో వరలక్ష్మికి అందాల్సిన చివరి విడత నగదు ఖాతాలో జమ కాలేదు. కూటమి సర్కార్ కొలువుదీరి మూడు నెలలవుతున్నా... ఇంతవరకూ జగన్ సర్కార్ విడుదల చేసిన మొత్తం గురించి ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. దీంతో జిల్లాలోని వేలాది మంది అక్కచెల్లెమ్మలు చేయూత చివరి విడత నిధుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

- రూ18,750 కోసం అక్కచెల్లెమ్మల నిరీక్షణ
- నాలుగేళ్ల పాటు అందించిన జగన్ ప్రభుత్వం
- ఎన్నికల కోడ్ పేరుతో అడ్డుకున్న కూటమి నేతలు
- ఇప్పుడు ఆ ఊసే ఎత్తని చంద్రబాబు సర్కారు

కదిరి: 'వైఎస్సార్ చేయూత' అందకుండా కూటమి నేతలు కుట్రలు చేశారు. 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు అండగా నిలిచేందుకు జగన్ ప్రవేశపెట్టిన ఈ పథకం అమలు కాకుండా ఎన్నికల సమయంలో అడ్డుకున్నారు. ఏడాదికి రూ.18,750 చొప్పున మూడేళ్లు తీసుకున్న 66 వేల మందికి పైగా లబ్ధిదారులు నాలుగో విడత నిధులను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసినా అందుకోలేకపోయారు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు.

పథకం పుట్టింది ఇలా

వైఎస్ జగన్ 2019 ఎన్నికలకు ముందు చేపట్టిన పాదయాత్రలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించగా, ఎంతోమంది మహిళలు ఆయన్ను కలిసి తమ బాధలు చెప్పుకున్నారు. 'మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీకు న్యాయం చేస్తాం' అని ఆయన హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు ఉన్న అక్కచెల్లెమ్మలకు 'వైఎస్సార్ చేయూత' పథకం ద్వారా ఏటా రూ18,750 అందజేస్తూ వచ్చారు. ఈ మొత్తంతో మహిళలు కిరాణా, పాలు, కూరగాయలు, పండ్లు, వస్త్ర వ్యాపారాలతో పాటు పాడి పశువుల ద్వారా ఆర్థికంగా లబ్ధిపొందారు. తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచారు.



డబ్బులివ్వకుండా అడ్డుకున్న కూటమి నేతలు

'వైఎస్సార్ చేయూత' చివరి విడత నిధులను అప్పటి సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి విడుదల చేశారు. అయితే ఎన్నికల సమయం కావడంతో కూటమి నేతలు కుట్ర పన్ని ఆ నగదు అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ కాకుండా చేశారు. 'ఎన్నికల్లో మహిళా ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు సీఎం జగన్ మహిళల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు' అని ఆరోపించారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేశారు. దీంతో నగదు పంపిణీ అర్ధాంతరంగా ఆగిపోయింది. అప్పటికే సుమారు 40 శాతం మందికిపైగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అయింది. ఇంకా 60 శాతం మంది మహిళలు చివరి విడత చేయూత నిధులు అందుకోవాల్సి ఉంది. అయితే రెండు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటి దాకా 'వైఎస్సార్ చేయూత' పథకంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వాస్తవానికి నాలుగేళ్లుగా అమలులో ఉన్న ఈ పథకానికి అప్పట్లో ఎన్నికల కమిషన్ అడ్డుచెప్పడాన్ని కూడా కొందరు తప్పుబడుతున్నారు.

'వైఎస్సార్ చేయూత' నాలుగు విడతల్లో అర్బన్, రూరల్ ప్రాంతాల్లో లబ్ధి

పంపిణీ	లబ్ధిదారులు	మొత్తం (రూ.కోట్లలో)
1వ విడత	1,22,385	229.45
2వ విడత	1,10,907	207.93
3వ విడత	132,171	247.80
4వ విడత	1,22,385	230.30
మొత్తం	1,32,171	915.48

చేయూతతో వేలాది మందికి లబ్ధి

గత ప్రభుత్వం అమలు చేసిన 'వైఎస్సార్ చేయూత' పథకం ద్వారా జిల్లాలోని 1,32,171 మంది అక్కచెల్లెమ్మలు రూ.915.48 కోట్లు లబ్ధి పొందారు. కదిరి మున్సిపాలిటీలో 7,016 మందికి రూ.27.26 కోట్లు, ధర్మవరం మున్సిపాలిటీలో 5431 మందికి రూ.28.09 కోట్లు, పుట్టపర్తి మున్సిపాలిటీలో 1483 మందికి రూ.7.64 కోట్లు, హిందూపురం మున్సిపల్ పరిధిలో 6,777 మందికి రూ.35.68 కోట్లు, మడకశిర అర్బన్‌లో 1,190 మందికి రూ.5.90 కోట్లు లబ్ధి చేకూరింది. అలాగే గ్రామీణ పరిధిలో చూస్తే కదిరి నియోజకవర్గంలోని 19,597 మందికి రూ.130.32 కోట్లు, ధర్మవరం నియోజకవర్గంలోని 19,430 మందికి రూ.120.66 కోట్లు, పుట్టపర్తి నియోజకవర్గంలోని 16,633 మందికి రూ.111.72 కోట్లు, హిందూపురం నియోజకవర్గంలోని 18,782 మందికి రూ.124.92 కోట్లు, మడకశిర నియోజకవర్గంలోని 21,565 మందికి రూ.146 కోట్లు, పెనుకొండ నియోజకవర్గంలోని 19,815 మందికి రూ.131.48 కోట్లు, రాప్తాడు నియోజకవర్గంలోని 7,004 మందికి రూ.45.81 కోట్ల లబ్ధి చేకూరింది. చివర విడత నిధులనూ అప్పటి ప్రభుత్వం విడుదల చేసినా ఆ డబ్బు కూడా లబ్ధిదారులకు ఇవ్వకుండా కూటమి సర్కార్ చోద్యం చూస్తోంది.

విడుదలైన డబ్బు ఇచ్చేకేమి?



జగన్ ప్రభుత్వంలో విడుదల చేసిన వైఎస్సార్ చేయూత పథకం డబ్బులు మహిళల ఖాతాలో జమ చేయడానికి చంద్రబాబుకు మనసు ఒప్పడం లేదు. ఎన్నికలప్పుడు ఆపారు. ఇప్పుడు ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కావడం లేదు. తాను అధికారంలోకి వస్తే 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1500 ఇస్తానని చెప్పాడు. అది కూడా ఇంత వరకూ ఇవ్వలేదు.

–సుగుణమ్మ, దాదిరెడ్డిపల్లి, ఓడి చెరువు మండలం

మార్గదర్శకాలు విడుదల కాలేదు



సార్వత్రిక ఎన్నికల సమయంలో కొందరు ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించడంతో 'వైఎస్సార్ చేయూత' పథకం నగదు పంపిణీకి బ్రేక్ పడింది. అప్పటికే కొందరు మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసినప్పటికీ, ఇంకా చాలా మంది ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. దీనిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాలేదు.

–నరసయ్య, డీఆర్‌డీఏ పీడీ

క్లుప్తంగా

ఎంబీసీని పరిశీలించిన సబ్ కలెక్టర్



కెనాల్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, తదితరులు

మడకశిర: హంద్రీ–నీవా ప్రాజెక్ట్‌లోని మడకశిర బ్రాంచ్ కెనాల్ (ఎంబీసీ)ను మంగళవారం పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ దేశేనాయక్ పరిశీలించారు. పెనుకొండ నుంచి సోమందేపల్లి, లేపాక్షి, హిందూపురం రూరల్ మండలాల మీదుగా మడకశిర వరకూ ఏర్పాటు చేసిన కెనాల్‌కు పడిన గండ్లను పరిశీలించి, వాటిని పూడ్చడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సబ్ కలెక్టర్ ఆదేశించారు.

మినీ వ్యాన్ బోల్తా... ఒకరి మృతి



వ్యాన్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

తాడిమర్రి: ప్రయాణికులతో వెళుతున్న మినీ వ్యాన్ బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.... వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం కటనూరు గ్రామానికి చెందిన బోనాల హరి (37), ఉమామహేశ్వరి దంపతులు తమ కుమారుడు తనీష్‌తో కలసి మంగళవారం ఉదయం అనంతపురం వెళ్లడానికి బస్సులో వెల్లిదండ్లకు చేరుకున్నారు. అక్కడి నుంచి పులివెందుల మీదుగా అనంతపురానికి వెళ్లే మినీ వ్యాన్ ఎక్కారు. తాడిమర్రి మండలం దాడితోట సమీపంలోకి చేరుకోగానే గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్ట్ ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి వ్యాన్ అదుపు తప్పి రోడ్డు పక్కన పల్లంలోకి బోల్తాపడింది. ఘటనలో హరితో పాటు ఖుషీద్‌బీ, శైలజ, రెడ్డమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే ప్రైవేట్ వాహనంలో పులివెందులలోని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో హరి మృతి చెందాడు. సమాచారం అందుకున్న తాడిమర్రి ఎస్ఐ నాగస్వామి, ఎఎస్ఐ సూర్యనారాయణరాజు అక్కడకు చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మున్సిపాలిటీలో వర్గపోరు

- రెండు గ్రూపులుగా విడిపోయిన పుట్టపర్తి మున్సిపల్ ఉద్యోగులు
- పని చేయని 28 మందికి దర్జాగా జీతాలు
- పట్టణంలో ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్త
- నిరుపయోగంగా చెత్త సేకరణ వాహనాలు
- అనుమతులు లేకుండా లీజ్‌కు ఆరు ట్రాక్టర్లు



పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం



మూలన పడిన చెత్త సేకరణ వాహనాలు

పుట్టపర్తి టౌన్: ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న పుట్టపర్తిలో అధికారుల మధ్య వర్గ పోరు తారాస్థాయికి చేరుకుంది. మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఒంటెత్తు పోకడలు, నియంతృత్వ ధోరణితో వేధింపులకు గురి చేస్తుండడంతో కిందిస్థాయి ఉద్యోగులు సామూహిక సెలవుపై వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం ఉదయం విధులకు రావడం.. సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్లిపోవడం మినహా పూర్తిస్థాయిలో బాధ్యతలు నిర్వహించడం లేదు. దీంతో మున్సిపాలిటీలో పాలన గాడి తప్పింది.

న్యాయబద్ధమైన ఇంక్రిమెంట్ల కోసం పోరాటం

తమకు న్యాయబద్ధంగా అందాల్సిన ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా కింది స్థాయి ఉద్యోగులను కమిషనర్ ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయంగా ప్రశ్నించిన ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని కమిషనర్ వేధింపులకు దిగుతున్నట్లు సమాచారం. అంతేకాక అందరూ చూస్తుండగా అవమానకరంగా మాట్లాడుతున్నారని పలువురు మండిపడుతున్నారు. గతంలోనూ ఓ అధికారితో జతకట్టి మిగిలిన ఉద్యోగులను వేధింపులకు గురి చేసేవారని వాపోతున్నారు. కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తూ మెమోలు జారీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు అండగా ఉండాల్సిన కమిషనరే.. ఉద్యోగుల్లో విభేదాలు తలెత్తేలా చేసి గ్రూపు రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం ఉద్యోగ సంఘం నేతలతో కలసి సమస్యను డీఆర్వో కొండయ్య, మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి దృష్టికి బాధితులు తీసుకెళ్లారు. ఈ కమిషనర్ తమకొద్దని, ఆయనే కావాలనుకుంటే తాము సెలవుపై వెళతామని తెలిపినా ఫలితం లేకపోయింది.

టీడీపీ నేతల పెత్తనం

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన రెండు నెలలకే పుట్టపర్తి మున్సిపాలిటీపై టీడీపీ నేతల పెత్తనం పెరిగిపోయింది. గత నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలోనూ మున్సిపాలిటీని ఇక తమకు అప్పగించాలని టీడీపీ కౌన్సిలర్లు అల్టిమేటం జారీ చేశారు. ఈ క్రమంలోనే ఉద్యోగుల్లో వర్గ పోరుకు ఊతమిస్తూ వస్తున్నారు. కాగా, మున్సిపాలిటీలో ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న వారు మొత్తంగా 128 మంది ఉన్నారు. ఇందులో 28 మంది టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న వారు ఉన్నారు. వీరంతా ఉదయం కార్యాలయానికి వచ్చి హాజరు పట్టీలో సంతకం చేసి ఇళ్లకు వెళ్లిపోయి, తమ వ్యక్తిగత వ్యాపారాలు చూసుకుంటున్నారు. వీరికి పనులు అప్పగించకుండా టీడీపీ నేతలు జోక్యం చేసుకుంటుండడంతో వ్యవస్థ గాడితప్పింది. దీంతో ఆ 28 మంది ఎలాంటి పని చేయకుండానే అప్పనంగా జీతం అందిపుచ్చుకుంటున్నారు.

ప్రభుత్వ వాహనాలు కాదంటూ...

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణకు గత ప్రభుత్వం దాతల సహకారంతో కొన్ని వాహనాలు సమకూర్చింది. ఈ క్రమంలోనే మరో రూ.20 లక్షల మున్సిపాలిటీ నిధులతో మరి కొన్ని వాహనాలు అందుబాటులోకి తెచ్చింది. ఈ వాహనాలను ఉపయోగించకుండా అధికారులు మూలన పెట్టేశారు. టీడీపీ నేతలకు చెందిన ఆరు ట్రాక్టర్లను లీజుకు తీసుకున్నారు. ఇందులో అధికారులకు భారీగా ముడుపులు అందినట్లు సమాచారం. ఈ విషయంపై విజిలెన్స్ అధికారులు కూడా కలగజేసుకొని మున్సిపాలిటీకి వచ్చి రికార్డులు కూడా తనిఖీ చేశారు. కార్యాలయంలో బిల్లులు, డీజిల్, పెట్రోల్, సీ బిల్లుల రికార్డులను స్వాధీనం చేసుకుని తమ వెంట తీసుకెళ్లారు. తదుపరి చర్యలు ఏమీ లేకపోవడంతో అక్రమాలు నానాటికీ పెరిగిపోతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

తడిసిన గూళ్లకు పరిహారం చెల్లించండి

- పట్టు రైతుల డిమాండ్



ఆందోళన చేస్తున్న పట్టు రైతులు

హిందూపురం: హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌లో తడిసిన గూళ్లకు తక్షణమే పరిహారం చెల్లించాలంటూ పట్టు రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి పట్టు గూళ్ల మార్కెట్‌లోకి వరద చేరుకుంది. దీంతో సోమవారం రాత్రి అమ్మకానికి రైతులు తీసుకువచ్చిన దాదాపు 5 టన్నుల పట్టు గూళ్లు తడిసి ముద్దయ్యాయి. దీంతో తీవ్రంగా నష్టపోయిన రైతులు తక్షణమే నష్ట పరిహారం చెల్లించాలంటూ పట్టుబట్టారు. మార్కెట్‌లో సరైన సదుపాయాలు కల్పించడంలో పాలక వర్గం విఫలమైందంటూ ఆరోపించారు. తడిసిన పట్టుగూళ్లను రోడ్డుపై పారబోసి ఆందోళనకు దిగారు. అనంతరం పట్టుగూళ్ల మార్కెట్ అధికారికి వినతి పత్రం అందించారు. కార్యక్రమానికి రైతు సంఘం నాయకుడు జయరామిరెడ్డి, రీలర్ ముస్తఫా మద్దతు పలికారు.

శ్రీవారి కల్యాణోత్సవం



హోమం నిర్వహిస్తున్న పండితులు



కల్యాణోత్సవంలో ఉత్సవమూర్తులు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. శ్రీవారికి రకరకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి, అర్చకులు మండపంలో హోమాలు నిర్వహించి, సంప్రదాయబద్ధంగా వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా మేళ తాళాల నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఐదు రోజులుగా విద్యార్థుల పస్తు

- పట్టించుకోని విద్యాశాఖాధికారులు

గోరంట్ల: విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఐదు రోజులుగా గోరంట్ల మండలం కమ్మలవాండ్లపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనం అందక ఆకలితో అలమటిస్తున్నారు. వివరాలు... పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ వంట చేయడం మానేసింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయడంలో విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో పాఠశాలలోని 26 మంది విద్యార్థులకు ఐదు రోజులుగా మధ్యాహ్న భోజనం అందకుండా పోయింది. విషయం తెలుసుకున్న ఆ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు స్పందించి సోమవారం తన ఇంటి నుంచి పిల్లలకు భోజనం పంపించారు. మంగళవారం యథావిధిగా పస్తులతోనే విద్యార్థులు పూట గడపాల్సి వచ్చింది. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. కొత్త ఏజెన్సీ ఏర్పాటుకు అనుమతులు జారీ అయ్యాయని, త్వరలో ఏజెన్సీని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.


పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

గార్లదిన్నె: పోక్సో కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు గార్లదిన్నె పోలీసులు తెలిపారు. వివరాలు... కనగానపల్లి మండలం మామిళ్లపల్లికి చెందిన సురేంద్రకు గార్లదిన్నెకు చెందిన యువతితో వివాహమైంది. కొంతకాలంగా భర్త వేధిస్తుండడంతో విసుగు చెందిన ఆమె పుట్టింటికి చేరుకుంది. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం భార్యను కాపురానికి పిలుచుకెళ్లేందుకు వచ్చిన సురేంద్ర... ఆ సమయంలో మూడేళ్ల వయసున్న కుమార్తెతో అనుచితంగా ప్రవర్తిస్తున్న విషయాన్ని గుర్తించిన ఆమె వెంటనే సోమవారం డీపీఓకు చేరుకుని ఎస్పీ మురళీకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ నుంచి రెఫరల్ అందుకున్న గార్లదిన్నె పోలీసులు విచారణ అనంతరం మంగళవారం ఉదయం సురేంద్రను అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

హత్యాయత్నం కేసులో భర్తకు జైలు

అనంతపురం సెంట్రల్: భార్యపై హత్యాయత్నం చేసిన కేసులో భర్తకు జైలు శిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ అడిషనల్ సెషన్స్ కోర్టు (పీఏఎస్) జడ్జి శంకరరావు తీర్పు వెలువరించారు. 2019, జూలై 22న అనంతపురంలోని ఆదర్శ నగర్‌లో నివాసముంటున్న సువర్ణబాయిపై భర్త శ్రావణ్ కుమార్ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఘటనపై అప్పట్లో కేసు నమోదు చేసిన సీఐ జాకీర్ హుస్సేన్ పక్కా ఆధారాలతో నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అప్పటి నుంచి కేసు వాదనలు కొనసాగుతూ వచ్చాయి. నేరం రుజువు కావడంతో శ్రావణ్‌కుమార్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. కేసులో ప్రాసిక్యూషన్ తరఫున వాదనలను పీపీ ఎంవీ రమణారెడ్డి వినిపించారు.

యువకుడి బలవన్మరణం



మృతుడు పవన్‌కుమార్

కంబదూరు: స్థానిక గుండ్లపల్లి కాలనీలో నివాసముంటున్న రామలక్ష్మి కుమారుడు పవన్‌కుమార్ (31) ఆత్మహత్య చేసుకున్నాడు. రామలక్ష్మికి ఓ కుమార్తె, ఓ కుమారుడు ఉన్నారు. కుమారుడు పవన్‌కుమార్ కొన్ని రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. దీనికి తోడు ఐదు రోజుల క్రితం అక్క గౌతమి బెంగళూరులో ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపంతో ఉన్న పవన్‌కుమార్ మంగళవారం ఉదయం కడుపు నొప్పి తాళలేక జీవితంపై విరక్తితో ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కూడేరు: మండలంలోని ముద్దలాపురం సమీపంలోని అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బళ్లారికి చెందిన ఈరన్న గౌడ్, వంద్రప్ప గాయపడ్డారు. ద్విచక్ర వాహనంపై బళ్లారి నుంచి వీరిద్దరూ అనంతపురం వెళ్తుండగా, మార్గంమధ్యలో కుక్క అడ్డు రావడంతో హఠాత్తుగా బ్రేక్ వేయడంతో అదుపు తప్పి కింద పడ్డారు. స్థానికుల సహాయంతో కూడేరులో చికిత్స పొందారు.

గేటు పడాలి.. పంటలు పండాలి

- నేడు టీబీ డ్యాం గేటు అమర్చేందుకు అధికారుల సన్నద్ధం
- ప్రయత్నాలు ఫలించాలని దేవుడుని వేడుకుంటున్న రైతన్నలు



అనంతపురం సెంట్రల్: తుంగభద్ర జలాశయం 19వ గేటు అమర్చేందుకు అధికారులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. జలాశయంలో నీరు తగ్గిన తర్వాతే పనులు మొదలు పెట్టాల్సి ఉంది. కానీ, కళ్లెదుటే నీరు సముద్రం పాలవుతుండడంతో ఎలాగైనా అడ్డుకట్ట వేసి ఆయకట్టుకు ఇవ్వాలని భావిస్తున్నారు. మంగళవారం తుంగభద్ర బోర్డు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఇంజినీరింగ్ అధికారులు అత్యవసర సమావేశం నిర్వహించారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి గేటు అమర్చవచ్చా అనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. మానవ ప్రయత్నంలో భాగంగా బుధవారం పనులు ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకు మూడు ప్రైవేటు కంపెనీల సహకారం తీసుకుంటున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. జిందాల్ స్టీల్ కంపెనీ పెద్దఎత్తున సహకారం అందిస్తున్నట్లు వివరించారు. గేటు పునరుద్ధరణ పనులు విజయవంతమైతే ఈ ఏడాది ఆయకట్టు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని భావిస్తున్నారు. ఈ క్రమంలో అధికారుల ప్రయత్నాలు ఫలించాలని రైతులు దేవుడిని వేడుకుంటున్నారు.

వ్యక్తి హత్య



హతుడు తిప్పేస్వామి

కంబదూరు: వివాహేతర సంబంధం ఓ వ్యక్తిని బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... కంబదూరు మండలం రాళ్లపల్లికి చెందిన తిప్పేస్వామి (40)కి ఐపార్సుపల్లికి చెందిన సుశీలమ్మతో పదేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లి తర్వాత ఐపార్సుపల్లిలోనే తిప్పేస్వామి స్థిరపడ్డాడు. ఈ క్రమంలో కొన్నేళ్లుగా కదిరిదేవరపల్లికి చెందిన సాకమ్మతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ వచ్చాడు. విషయం తెలుసుకున్న సాకమ్మ సంబంధీకులు పలుమార్లు తిప్పేస్వామిని మందలించారు. అయినా ఆయనలో మార్పు రాలేదు. దీంతో కక్ష పెంచుకున్న సాకమ్మ మరిది రాజు, నరేష్ సోమవారం రాత్రి కంబదూరు నుంచి రాళ్లపల్లికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న తిప్పేస్వామిని కంబదూరు శివారులోనే చాకిరేవు వద్ద అడ్డుకుని బండరాయితో తలపై మోది ఉడాయించారు. తీవ్ర రక్తస్రావంతో పడి ఉన్న తిప్పేస్వామిని అటుగా వెళుతున్న వారు గమనించి వెంటనే అనంతపురానికి తరలించారు. చికిత్సకు స్పందించక అదే రోజు రాత్రి ఆయన మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

నిందితుల అరెస్ట్

కళ్యాణదుర్గం రూరల్: తిప్పేస్వామి హత్యకేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివాహేతర సంబంధంతో వ్యక్తి దారుణ హత్యకు గురైయ్యాడు. ఈ సంఘటన కంబదూరు మండలంలో సోమవారం చోటు చేసుకుంది. హత్యకు గల కారణాలును కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ రవిబాబు, సీఐ ఎస్.వి.నాగరాజు వెల్లడించారు. తిప్పేస్వామిని కంబదూరు మండలం రాళ్ల అనంతపురం గ్రామానికి చెందిన హరిజన రాజు, హరిజన నరేష్ హతమార్చినట్లు వెల్లడించారు. తమ బంధువైన మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే నెపంతోనే ఈ దారుణానికి ఒడిగట్టారన్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం మధ్యాహ్నం కంబదూరు మండలం రాళ్లపల్లి గ్రామం వద్ద నిందితుల్ని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారన్నారు.

కనుల పండువగా 'బెస్ట్' స్నాతకోత్సవం



పట్టాలు పొందిన ఆనందంలో బెస్ట్ యూనివర్సిటీ విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: ప్రపంచం గర్వించే స్థాయికి ఆర్థికశక్తిగా భారత దేశం అవతరించనుందని టార్చ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఎండీ, గ్రేటర్ పసిఫిక్ క్యాపిటల్ సీనియర్ అడ్వయిజర్ శౌర్య డోవల్ అన్నారు. గోరంట్ల సమీపంలోని భారతీయ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ (బెస్ట్) యూనివర్సిటీ రెండో స్నాతకోత్సవం మంగళవారం కనుల పండువగా జరిగింది. వర్సిటీ చైర్మన్ భరత్‌లాల్ మీనా, చాన్సిలర్ డాక్టర్ రూపావాసుదేవన్, వైస్ చాన్సిలర్ డాక్టర్ సుబ్రహ్మణ్య, అనురాధ ధర్, డీన్ రాంగోపాల్, రిజిస్ట్రార్ జైప్రకాష్, ప్రొఫెసర్ అర్చన తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథిగా విచ్చేసిన శౌర్య డోవల్ మాట్లాడుతూ... భారత దేశం ప్రజాస్వామికంగా, ఆర్థికంగా వేగంగా అభివృద్ధి సాధిస్తోందన్నారు. 2007 వరకూ మన దేశం 1 ట్రిలియన్ ఎకానమి సాధించగా ప్రస్తుతం 3 ట్రిలియన్ ఎకానమీని సాధించిందన్నారు. రాబోవు 10 ఏళ్లలో 4 ట్రిలియన్ ఎకానమీతో ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానానికి దేశం ఎదుగుతుందన్నారు. భరత్ లాల్‌మీనా, రూపావాసుదేవన్ మాట్లాడుతూ... ప్రతి విద్యార్థికీ ఎంతో భవిష్యత్తు ఉందని, బయటకు వెళ్లి ఓ ఉద్యోగిగా స్థిర పడేకన్నా ఉద్యోగాల కల్పన చేసే యజమానిగా ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం 392 మంది విద్యార్థులకు పతకాలు, అవార్డులను ప్రదానం చేశారు. అగ్రికల్చర్ విభాగంలో విద్యార్థులు హిమబిందు, చేతన్, చందన బంగారు పతకాలు, అమృత వర్షిణి, బాబా ఫకృద్దీన్ సిల్వర్ మెడల్ అందుకున్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి



మృతుడు గౌస్

గోరంట్ల: విద్యుత్ షాక్‌కు గురై ఓ కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురానికి చెందిన గౌస్ (28) మరమగ్గాల మరమ్మతు పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి గోరంట్లలోని కట్ట రామచంద్రకు చెందిన మర మగ్గాల మరమ్మతు కోసం మొత్తం ఏడుగురు మెకానిక్‌లు వచ్చారు. వీరిలో గౌస్ కూడా ఉన్నాడు. విద్యుత్ తీగను కట్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు షాక్ గురై తీవ్రంగా గాయపడిన గౌస్‌ను తోటి కార్మికులు వెంటనే గోరంట్లలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శేఖర్ తెలిపారు.

విద్యార్థిని బలవన్మరణం



మృతురాలు అక్షయ

ధర్మవరం అర్బన్: జీవితంపై విరక్తితో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు..... ధర్మవరంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన అక్షయ (17) రెండేళ్ల వయసులో ఉన్నప్పుడే తల్లి నాగవేణి వదిలి వెళ్లిపోయింది. తండ్రి అనిల్ కుమార్ రెడ్డి ప్రస్తుతం అనంతపురంలో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో చిన్నప్పటి నుంచి తన అమ్మమ్మ ప్రభావతి, తాత గోవిందరెడ్డి వద్దనే అక్షయ పెరిగింది. అనంతపురంలోని మాస్టర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఆమె ఇటీవల ఇంటికి వచ్చింది. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సస్యరక్షణ చర్యలు తీసుకోండి

- ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రామసుబ్బయ్య

మడకశిర రూరల్: మండలంలోని కదిరేపల్లి, ఉగ్రేపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన వేరుశనగ, మొక్కజొన్న, కంది, రాగి పంటలను మంగళవారం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య, ఏడీఏ కృష్ణమీనన్ పరిశీలించారు. ప్రస్తుతం వేరుశనగ పంట ఊడలు దిగే దశలో ఉందని, ఇసుక నేలల్లో సాగు చేసిన వేరుశనగ పంటకు వేరు పురుగు ఆశించి మొక్కలు ఎండిపోతున్నాయని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వేసవిలో లోతుగా దుక్కులు, విత్తన శుద్ధి చేసుకుని విత్తుకుంటే వేరు పురుగును నివారించవచ్చునన్నారు. పంట సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించాలని సూచించారు. వర్షాలు రాక వేరుశనగ పంట సాగు చేయని రైతులకు వంద శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు అందించాలని రైతులు కోరారు. కార్యక్రమంలో ఏఓలు తిమ్మప్ప, వీరనరేష్, రైతు సేవా కేంద్రం సిబ్బంది ఆయేషా, రైతులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో దూడ మృతి



దూడ కళేబరం

పావగడ: చిరుత దాడిలో ఓ గేదె దూడ మృతి చెందింది. వివరాలు... పావగడ తాలూకా మంగళవాడ గ్రామానికి చెందిన రైతు తిమ్మణ్ణ సోమవారం రాత్రి తన పొలంలోని పాకలో గేదెతో పాటు దూడను కట్టేసి ఇంటికెళ్లి నిద్రించాడు. మంగళవారం ఉదయం పాక వద్దకెళ్లి చూడగా దూడ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల గాలించగా దూడ కళేబరం కనిపించింది. సోమవారం రాత్రి చిరుత పాకలోకి ప్రవేశించి గేదె దూడను లాక్కెళ్లి సగం తినేసి వదిలి వెళ్లినట్లుగా గుర్తించాడు. సమాచారం అందుకున్న అటవీ శాఖ, పశు వైద్యాధికారులు అక్కడకు చేరుకుని దూడ కళేబరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. చిరుత బారి నుంచి కాపాడాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చిలమత్తూరు: మండలంలోని కసుమ అటవీ ప్రాంత శివారులో పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ జనార్దన్ తెలిపిన మేరకు... ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన లేపాక్షి ఎస్ఐ గోపి, ఎస్‌బీ ఎస్ఐ ప్రదీప్, సిబ్బంది మంగళవారం ఉదయం కసుమ అటవీ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.50,100 నగదు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థి అదృశ్యం



మనోజ్‌కుమార్

గుత్తి: స్థానిక బ్రాహ్మణవీధిలో నివాసముంటున్న కుళ్లాయి స్వామి, చౌడమ్మ దంపతుల కుమారుడు మనోజ్‌కుమార్ కనిపించకుండా పోయాడు. గుత్తి కోట పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మనోజ్ కుమార్... సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బాలుడి ఆచూకీ కోసం తల్లిదండ్రులు గాలించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో మంగళవారం ఉదయం ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.